ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 5-7-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నవస్తువు ఒక్కటే. దానిని బ్రహ్మం అంటున్నారు. అది ఏకము, నిత్యము, అద్వితీయము. బ్రహ్మము ఎటువంటిది అంటే అది శాంతమైనది, నిదానమైనది, స్వయంప్రకాశమైనది. బ్రహ్మం తప్పించి మిగిలినది అంతా జడమే. ఎండమావులలో నీరు ఉండదు. కాని నీరు ఉన్నట్లు నీమనస్సుకు కనిపిస్తోంది. అలాగే బ్రహ్మములో ప్రపంచం లేదు. ప్రపంచం ఉన్నట్లు నీమనస్సుకు కనిపిస్తోంది. ఉన్నది బ్రహ్మమే. ప్రపంచం నిజంగాలేదు. నీమనస్సుకు ప్రపంచం ఉన్నట్లు కనిపిస్తోంది. మనస్సు ఉన్నప్పుడు ప్రపంచం కనిపిస్తోంది. మనస్సు లయం అయినపుడు నీకు ఏమీకనిపించటంలేదు. నీవే ఉన్నావు. ఉన్నది ఒక్కటే. నీవు, నేను అనే భేధబుద్ధికూడా మనస్సుయొక్క కల్పితమే. జన్మించటం, మరణించటం అంతాకూడా మనస్సుయొక్క కల్పితము. ఇవి అన్నీ తలంపులే. బ్రహ్మములో మాయలేదు, బ్రహ్మంలో సృష్టిలేదు. మాయ ఉన్నట్లు, సృష్టి ఉన్నట్లు మీమనస్సుకు కనిపిస్తోంది. మనస్సు నశిస్తే మనస్సు కల్పించినవిఅన్నీకూడా నశిస్తాయి. మనస్సు కల్పించినవిఅన్నీ నశించినపుడు ఉన్నవస్తువు ఏదోఉన్నట్లుగా నీకువ్యక్తమవుతుంది.

ఉన్నది బ్రహ్మంమాత్రమే. మిగిలినవిఅన్నీ కల్పితములు. ఉన్నది ఉన్నట్లుగా నీకు ఎంతకాలముఅయితే కనిపించదో అంతకాలము సంసారంఅనే రోగం నిన్ను వెంటాడుతూఉంటుంది. ఈసంసారం అనేది దీర్ఘరోగం. ఈశరీరమును స్మశానంలో దహనంచేసినప్పటికీ సంసారంఅనే రోగం కాలదు. ఎంతకాలం అయితే భేధబుద్ధిఉందో, అజ్ఞానంఉందో, ఉన్నవస్తువును ఉన్నట్లుగా నువ్వుచూడలేవో అంతకాలము ఈజననమరణ చక్రంలో తిరగవలసిందే. నిన్ను బాధ విడిచిపెట్టదు. దుఃఖము విడిచిపెట్టదు అంటున్నారు ఆచార్యులవారు. ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకువ్యక్తంకావాలి. నీకు భేధబుద్ధి ఉంటే ఆవస్తువు ఉన్నది ఉన్నట్లుగా నీకువ్యక్తంకాదు. నీభయానికి, దుఃఖానికి, కామానికి, క్రోధానికి భేధబుద్దే కారణం. భేధబుద్ధి నశించినరోజున ఆవస్తువు నీకు వ్యక్తమవుతుంది.

ప్రతిమనిషి కోరికతో పనిచేస్తాడు. ఒక్కజ్ఞాని తప్పించి, పరమేశ్వరుడు తప్పించి జీవకోటిఅంతా వారి కామక్రోధములమీద ఆధారపడి పనిచేస్తున్నారు. కామక్రోధములమీద ఆధారపడి పనిచేస్తూఉంటే ఆపని వాడిని చుట్టుకొంటుంది. కామక్రోధములవలన కర్మవస్తోంది. కర్మవలన దేహం వస్తోంది. దేహంవలన దుఃఖం వస్తోంది. అంటే దుఃఖం నశించాలంటే దేహంరాకూడదు. నీకు దేహం రాకూడదుఅంటే నీవు కర్మచేయకూడదు. అంటే కామక్రోధములమీద ఆధారపడిన కర్మ చేయకూడదు. కర్మచేయకుండా ఉండాలంటే కామక్రోధములు తగ్గాలి. కామక్రోధములు తగ్గాలంటే నువ్వు ఎవడివో నీకు తెలియాలి. నువ్వు ఎవడివో నీకుతెలిస్తేగాని నీకు భేధబుద్ధి నశించదు. భేధబుద్ధి ఉన్నంతకాలము కామక్రోధములు వస్తూనేఉంటాయి. కామక్రోధములు వస్తున్నంతకాలము నీవు కర్మమానవు. కర్మచేస్తే దేహం వస్తుంది. దేహంవచ్చినవెంటనే దుఃఖం వస్తుంది.

మనలో మూడువాసనలు ఉన్నాయి. లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన ఈమూడు వాసనలు నశిస్తేనేగాని మనమనస్సు బ్రహ్మంవైపుకు తిరగదు. మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానము లేకపోతే ముక్తిరాదు. లోకంలో ఏవస్తువుమీద మనకు ప్రీతి ఉన్నా మనలో లోకవాసన ఉన్నట్లేగుర్తు. దేహవాసనఅంటే దేహంమీద

అభిమానం, అపేక్ష. 24గంటలు పొట్టగొడవ, బట్టగొడవ తప్పించి జ్ఞానంగొడవ ఉండదు. ఈదేహముతో ఎన్నిరకాలైన భోగాలు అనుభవించాలి అని చూస్తూఉంటాడు. దేహవాసన ఉన్నవాడికి భోగదృష్టి ఎక్కువగా ఉంటుంది. శాస్త్రవాసన ఉన్నవారికి వారిహృదయంలోఉన్న భగవంతుని తెలుసుకోవాలి అనేకోరిక ఉండదు. ఆపుస్తకంలో ఒకమాట, ఈపుస్తకంలో ఒకమాట చదివి ఆమాటలు పట్టుకొని వాదించుకోవటం. దీనివలన వారికి ఏమీ కలిసిరాదు. బుద్ధి అక్కడితో ఆగిపోతుంది. ఇది శాస్త్రవాసన. శాస్త్రములోచెప్పిన విషయంయొక్క సారాన్ని మనహృదయంలో అనుభవించాలిఅనే బుద్ధివారికి కలుగదు. శాస్త్రవాసన వారికి కలుగనివ్వదు. వారికి పాండిత్యంతో సరిపోతుంది. శబ్దాడంబరము తప్పించి హృదయంయొక్కలోతులు ఉండవు. ఈవాసన ఉన్నప్పుడు బ్రహ్మానుభవం నీకు కలుగదు. ఈ వాసనలు తొలగించుకొంటేగాని నీహృదయంలోఉన్న వస్తువు నీకు వ్యక్తంకాదు.

ఆచార్యులవారు ఏమంటున్నారుఅంటే బ్రహ్మములో భేధములేదు, నీమనస్సులో భేదం ఉంది అంటున్నారు. ఈహెచ్చుతగ్గులు అవి నీమనస్సు కల్పిస్తున్న గొడవలు. ఉన్నది ఒక్కటేవస్తువు. ఆవస్తువు నీకు వ్యక్తమవ్వాలంటే భేధబుద్ధి నశించాలి. ఉన్నవస్తువును ఉన్నట్లుగా చూడకుండా అందులోఉన్న భేధాన్ని చూస్తూఉంటే నీకు పునర్జన్మ వచ్చితీరుతుంది. పునర్జన్మఅంటే శరీరం వస్తుంది. శరీరంవస్తే దుఃఖం వస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు. దానిని నీవు అనేకంగా చూస్తున్నావు. ఇక్కడ అనేక శరీరాలు ఉన్నాయి. ఈశరీరాలలో రంగులు, వయస్సు, గుణాలు తేడా ఉండవచ్చు. నీవు ఆభేధాన్ని చూడవద్దు. హృదయంలోఉన్న వస్తువు బ్రహ్మమే. ఆబ్రహ్మమును చూడటం నేర్చుకో. మంచి, చెడ్డ అనేది మనస్సుకు సంబంధించినదే. మంచి, చెడ్డఅనేది బ్రహ్మంలోలేదు. బ్రహ్మంలో గుణంలేదు. అందుచేత నిర్గుణస్థితికి, నిరాకారస్థితికి ఎదిగివెళ్ళాలి. గుణాలు మనస్సునుబట్టి మారతాయి. గుణాలయొక్క చేష్టలుఅన్నీ మనస్సులోనే ఉన్నాయి. నీమనస్సు ఎంతనిజమో ఈగుణంకూడా అంతేనిజం. ఆత్మదృష్టితో చూస్తే గుణంకూడా అసత్యమే. గుణంఅనేది మనస్సుకు పరిమితమైనది. మంచిగుణాలు అలవాటుచేసుకోవాలి. మంచిగుణాలు పరమస్థితికాదు, మంచిగుణాలు గమ్యంకాదు. బ్రహ్మంను తెలుసుకోవటానికి మంచిగుణాలు సహకరిస్తాయి. నాలో మంచిగుణాలు ఉన్నాయి. అందుచేత నేను దేవుడిని అయిపోయాను అనుకోకూడదు, ఆత్మ తెలిసిందిఅని అనుకోకూడదు. గుణంఅనేది బ్రహ్మంను తెలుసుకోవటానికి సహకరించే సంపదమాత్రమేగాని గుణం నిజంకాదు.

ప్రపంచం అసత్యంఅని శాస్త్రములు, అనేకమంది మహాత్ములు చెపుతున్నారు. వారుఅంతా ఏదిఅయితే అసత్యంఅని చెపుతున్నారో దానితో తాదాప్యంపొందటం మానకుండా దానితోటే తాదాప్యంపొందుతూ నాకుమోక్షంకావాలిఅంటే నీకు ఎక్కడనుండి వస్తుంది అంటున్నారు ఆచార్యులవారు. నీవు దేహంకాదు, నీకళ్ళకు కనబడే ప్రపంచం నిజంకాదు అనిశాస్త్రం చెపుతోంది. నీచేత చూడబడేది ఏదీనిజంకాదు. ఈ ప్రపంచము, దేహము, నీమనస్సు, కామక్రోధములు అన్నీ నీచేత చూడబడుతున్నాయి. ఏవైతే నీచేత చూడబడుతున్నాయో వాటితో నీవుతాదాప్యం పొందుతున్నావు. అలా తాదాప్యం పొందవద్దుఅని శాస్త్రములు చెపుతున్నాయి, మహాత్ములు చెపుతున్నారు. అయినా నీకు ఆబుద్ధి పోవటంలేదు అంటున్నారు స్వాములవారు. నీచేత చూడబడేది ఏదీనిజంకాదు. ఎందుచేతనంటే ఏదైతే నీచేత చూడబడుతోందో అది అంతా గాఢనిద్రలో అణిగిపోతోంది. మనస్సువచ్చాక అన్నీ వస్తున్నాయి. మనస్సు అణిగిపోతే ఇవిఅన్నీ అణిగిపోతున్నాయి. నువ్వుకాని రంగుతోటి, దేహంతోటి, తెలివితోటి తాదాప్యంపొందుతున్నావు. నువ్వుకానిదానితో తాదాప్యం పొందుతున్నంతకాలము నువ్వు ఎవరివో నీకు తెలియదు, నీకు మోక్షశాంతి తెలియదు.

ఆత్మచింతన తప్పించి ఇతర చింతలు కొంచెముకూడా పుట్టకుండాచూసుకోఅంటారు భగవాన్. నిరంతరము ఆత్మనే చింతించు. ఇతర చింతలు నీలో ప్రవేశించటానికి కొంచెముకూడా అవకాశము ఇవ్వకు. నీకు

తెలుస్తున్నా, తెలియకపోయినా నీవు బ్రహ్మమే. ఆబ్రహ్మమును నిరంతరము చింతించగా, చింతించగా అదే నువ్వు అవుతావు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా, ఏమతంలోఉన్నా భావనాబలం లేకపోతే బ్రహ్మంను పొందలేవు అన్నారు రమణస్వామి. అందువలన భావనాబలం ఉండాలి. నీకు శరీరం ఉన్నప్పటికీ శరీరంలో శక్తిలేకపోతే నీవు అటూ ఇటూ తిరగలేవు. అదేవిధంగా నీహృదయంలో బ్రహ్మంఉన్నప్పటికీ నీకు భావనాబలం లేకపోతే దానిని నీవు తెలుసుకోలేవు. భక్తిమార్గంలో ప్రయాణంచేసినా, కర్మమార్గంలో ప్రయాణంచేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణంచేసినా భావనాబలం రావాలి. భావనాబలం రావాలంటే నీలోఉన్న కామక్రోధములు పల్చబడాలి. కోరికతో పనిచేస్తే కామక్రోధములు పెరుగుతాయి. కోరికలేకుండా పనిచేస్తే కామక్రోధములు తగ్గుతాయి. ఆయుర్వేదం మందువాడినా, హోమియోపతి మందువాడినా, ఇంగ్లీషుమందువాడినా అసలురోగం తగ్గుతోందా, లేదాఅని చూసుకోవాలి. అలాగే మీరు ఏమార్గములో ప్రయాణంచేసినా భక్తిమార్గంలోగాని, కర్మమార్గంలోగాని దేనిలో ప్రయాణంచేసినా కామక్రోధములు ఎంతవరకూ తగ్గుతున్నాయో చూసుకోండి అంటున్నారు భగవాన్. కామక్రోధములు తగ్గకపోతే స్వార్థంతో పనిచేయటం మానడు. స్వార్థం వాడినిచుట్టుకొంటుంది. దానినిబట్టి శరీరం వస్తుంది. శరీరంవెంట దుఃఖం వస్తుంది.

ఈదేహం ఎవరిది అంటే మృత్యుదేవతది. ఎవరి ఇంటికైనా వెళ్ళి వస్తువును దొంగిలించి తెచ్చి అదినాది, అదినాది అనుకోవటం ఎలా ఉంటుందో ఈదేహంనాది, ఈదేహంనాది అనుకోవటం అలాగే ఉంటుంది. ఈదేహం మృత్యుదేవతది. ఏదోరోజు మరణంవచ్చి ఈదేహమును పట్టుకొనివెళ్ళిపోతుంది. ఈదేహంనాది, ఈదేహంనాది అంటున్నావు నీది అయితే ఎందుకు చనిపోతున్నావు అంటున్నారు అచార్యులవారు. రాజుగారు ఒక ఇంటిలో ఉంటున్నారు అనుకోండి. ఆఇల్లు అంటుకొంది అనుకోండి. ఇల్లు అంటుకొన్నా ఫరవాలేదు. పల్లకీవచ్చిన తరువాత ముస్తాబుచేసి మర్యాదలు చేసి పల్లకీలో కూర్చోబెడదాము అనిచూస్తారా లేక కాళ్ళుచేతులు పట్టుకొని రాజుగారిని వెంటనే బయటకు పడేయటానికి చూస్తారా? కాళ్ళుచేతులు పట్టుకొని రాజుగారిని ఆఇంటిలోనుండి బయటకు పడేయటానికే చూస్తారు. అంతేగాని పల్లకీ వచ్చినతరువాత ముస్తాబుచేసి తీసుకొనివెళదాము అని ఎవడూ చూడడు. అదేవిధంగా మీరు చావటానికి సిద్ధంగా ఉన్నారు ఈగొడవ ఏమిటి? అంటుకొన్న ఇంటిలోనుండి మనిషిని ఎంత తొందరగా బయటకు తీసుకొనివస్తారో అంత తొందరగా మీరు బాగుపడాలి. ఒకప్రక్క ఇల్లు అంటుకుపోతోంది. రాజుగారు కాలిపోవటానికి సిద్ధంగా ఉంటే సవారు వచ్చిన తరువాత రాజుగారిని బయటకు తీస్తాములంటే ఎలా ఉంటుందో మేము సాధన రేపుచేసుకొంటాము, రేపుచేసుకొంటాము అంటే అలా ఉంటుంది. సాధనచేసుకోవటానికి ఇంక టైము ఉంటుందా. మీదేహం చనిపోవటానికి సిద్ధంగా ఉంది. ఎంతకాలము సాధనలేకుండా కాలమును దుర్వినియోగం చేసుకొంటారు. భగవంతుని తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి.

నీ మనస్సు, బుద్ధి అంతా మాయ. ఇదిఅంతా జడము. నీబుద్ధి ఎంత అసత్యమో బుద్ధికి కలిగే అనుభవాలుకూడా అంతే అసత్యం. నీబుద్ధినిబట్టి కాకుండా పరమాత్మ ఏమాటఅయితే చెప్పాడో ఆమాటను ప్రమాణంగా తీసుకొని దానిని ఆచరించటానికి ప్రయత్నంచెయ్యి. అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచెయ్యి. పరమాత్మ చెప్పినమాటను అర్థంచేసుకోవటానికి నీబుద్ధిని ఉపయోగించుకో. భగవంతుడు ఒకమాట చెప్పాడు అనుకోండి, ఆమాటకు విరుద్ధంగా మీబుద్ధి పనిచేస్తోంది అనుకోండి. దానికి విరుద్ధంగా మీబుద్ధికి సంబంధించిన అనుభవం ఉంది అనుకోండి. మీఅనుభవాన్ని ఒకప్రక్కకుపెట్టి భగవంతుడు చెప్పినమాటను ప్రమాణంగా తీసుకొని నీవు ప్రయాణంచెయ్యి. అంతేగాని నాబుద్ధి ఇలా చెప్పింది అని ప్రయాణం చెయ్యవద్దు. అది జడము. భగవంతుడు ఏపనులు అయితే చేయవద్దని చెపుతున్నాడో ఆపనులు మనం చేయకూడదు. ఆచరించమని చెప్పినవాటిని ఆచరించాలి. నిషిద్ధకర్మలను విడిచిపెట్టు. భగవంతుని మాటను ప్రమాణంగా తీసుకో.

నీవు జీవితం పొడుగునా నిష్కామకర్మ చెయ్యి, పూజ చెయ్యి, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి. భగవంతుడు దేహం కావాలంటే స్వేచ్ఛగా తీసుకొంటాడు, స్వేచ్ఛగా వదలివేస్తాడు. మనకు శరీరం వచ్చినపుడు, శరీరం వదలినపుడు ఒకటే ఏడుపు. ఎందుచేతనంటే మనవి కర్మనుబట్టి వచ్చిన దేహాలు. కర్మానుభవంకోసం వచ్చిన దేహాలు. భగవంతుడు దేహంలో ఉన్నప్పటికి తాను దేహమాత్రుడనుకాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. భగవంతుని రూపంకంటే భగవంతునినామం గొప్పది. భగవంతుని నామమును నిరంతరము స్మరించటంవలన ఆదేవతారూపముతో నీకు మానసికఅనుబంధం ఏర్పడుతుంది. దానివలన మనస్సు పవిత్రం అవుతుంది. పూజ, జపం, ధ్యానం, విచారణ చెయ్యండి. కాని తెలిసి చెయ్యండి. వీటి ప్రయోజనం అంతఃకరణం శుద్ధిపడటంకోసం, హృదయం శుద్ధిపడటంకోసం. హృదయశుద్ధికలవారు ధన్యులు వారు దేవుని చూచెదరుఅని బైబిలులో చెప్పారు. పూజద్వారా, జపంద్వారా, ధ్యానంద్వారా నీహృదయం ఎప్పుడైతే శుద్ధిఅయిందో నీహృదయంలోఉన్న భగవంతుడు నీకు ఎరుకపడతాడు. పూజద్వారా, జపంద్వారా, ధ్యానంద్వారా, విచారణద్వారా మీహృదయంలోఉన్న దోషములు ఎప్పుడైతే బయటకు వచ్చేసాయో మీహృదయంలో నేనుఉన్నానుకదా మీకు ఎరుకపడతాను అంటున్నాడు భగవంతుడు. అందుచేత నీవు నిష్కామకర్మకు, పూజకు, జపానికి, ధ్యానానికి నీజీవితాన్ని అంకితం చేసుకోవాలి.

గుడ్డివాడికి వస్తువు ఎదురుగాఉన్నా కనిపించదు. కనబడటంలేదు అనివాడు అనుకోడు అసలు వస్తువే లేదు అనుకొంటాడు. నదిలో నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ఒకోసారి వేగముగా ఉంటుంది, ఒకోసారి తక్కువగా ఉంటుంది. ఒక్కనిమిషం ఆగమంటే ఆగుతుందా? ఆగదు. అలా ప్రవహిస్తూనే ఉంటుంది. అలాగే దేవుని అనుగ్రహం ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. కాని ఆ అనుగ్రహప్రవాహాన్ని నీవు చూడలేకపోతున్నావు. నీరు ఎలా ప్రవహిస్తోందో దేవుని అనుగ్రహం అలాప్రవహిస్తోంది. మనకు అర్హత, యోగ్యత లేనిమూలంగా మనం దానిని అందుకోలేకపోతున్నాము. నీకు గ్రహించేబుద్ధి లేనపుడు వస్తువు ఎదురుగా ఉన్నానీకు కనబడదు. కృష్ణుడు ఉన్నప్పుడే దేవుని అనుగ్రహం ఉంది, రాముడు ఉన్నప్పుడే దేవుని అనుగ్రహం ఉంది. ఇప్పుడులేదు అనుకోవద్దు. అనుగ్రహం ఎప్పుడూఉంది. అది నిరంతరము ప్రవహిస్తోంది. దానిని అందుకొనే శక్తిని, యోగ్యతను, అర్హతను మనం సంపాదించుకోవాలి.

భగవంతుని అనుగ్రహం మీమీద ఎప్పుడూ ఉందికాని లేదని మీరు అనుకొంటారు. మీకు ఇష్టంలేని సంఘటనలు జరిగినపుడు దేవుని అనుగ్రహం లేదు అందుకే ఇలా జరిగింది అనుకొంటారు. అలాఎందుకు జరిగిందిఅంటే మీకళ్ళుతెరిపించటంకోసం, మీహృదయంయొక్క లోతులు పెంచటంకోసం భగవంతుడు ఒకోసారి తలపుసందునపెట్టి నొక్కుతూఉంటాడు. అలా తలపుసందునపెట్టి నొక్కినపుడు భగవంతుని అనుగ్రహం మాకులేదు అని మీరు అనుకొంటారు. దేవుని అనుగ్రహం ఎలాఉందో మీకు తెలియజేయటంకోసం అలా తలపుసందునపెట్టి నొక్కుతాడు. అప్పుడు మీకు బాధకలుగుతుంది. మిమ్మల్ని మేల్కొలపటంకోసం ఆబాధను ఈశ్వరుడే పంపిస్తున్నాడు. అప్పుడు దేవుని కరుణ లేదుఅని అనుకొంటాము. ఆదేవుని కరుణే ఈబాధను మీకు పంపిస్తోందిఅని మీకు తెలియదు. తెలియక దేవుని కరుణే లేదుఅని మీరు అనుకొంటారు. మీకు ఇష్టంలేని సంఘటన జరిగింది అనుకోండి. మీరుబాధపడతారు. ఆబాధపడేది ఎవరు? మనస్సు. ఈమనస్సు ఎంతనిజమో ఆబాధకూడా అంతేనిజం. రెండూ నిజంకాదు. మనస్సుకి బాధను ఎందుకు పంపిస్తున్నాడు అంటే మనోపరిధినుండి నిన్ను బయటకులాగి నీకు ఆత్మానుభవం కలుగజేయటంకోసం పంపిస్తున్నాడు. బాధనుచూసి నీవు కంగారుపడవద్దు. నీమనస్సు ఎంత అసత్యమో ఆబాధకూడా అంతే అసత్యము

మీరు ఏదైతే కాదో దానినే మీరు చింతిస్తూ, దానినే జపిస్తూ ఉంటే మీరు ఏనాటికైనా నశిస్తారు. నువ్వు అనిజంలో బ్రతుకుచున్నావు అనుకో తప్పనిసరిగా అదినిన్ను బంధిస్తుంది. నిజంకానిదానిని నీవు నిజం

అనుకొన్నప్పటికీ అదినిజంకాదు కాబట్టి అదినిన్ను బంధిస్తుంది. మనం ఏండ్రిన్ త్రాగాముఅనుకోండి. అది ఏండ్రిన్అని మనం తెలియక త్రాగినా అది మనలను చంపేస్తుంది. ఒకచెడ్డపని అదిచెడ్డఅని తెలియకచేసినా అది నశింపజేస్తుంది. మీకు బాగుపడే ఉద్దేశంఉంటే మీరు కానిదానినుండి వేరుపడడం నేర్చుకోవాలి. వేరుపడటం మీకు ఇష్టంలేకపోయినా దేవుడే వేరుచేస్తాడు. ఈనాటికైనా, ఏనాటికైనా, ముందునాటికైనా మనంకానిదానిలోనుండి విడిపోవటం తప్పదు అని భగవాన్ చెప్పారు. ఎవడిదేహాన్ని విడిచిపెట్టటం వాడికి ఇష్టం ఉండదు. కాని దేవుడు విడదీసేస్తాడు. మన జీవితంఅంతా మనోపరిమితం. కోరికలు, విషయాలు, మనస్సులో ఉన్న దుమ్ముఅంతా నిజంకాదు. అయినా దానితోటి బ్రతుకుచున్నారు. అందులో బ్రతకటం మానివెయ్యి. నువ్వుకానిదానిని నువ్వు అనుకోవచ్చుకాని నువ్వు అవ్వవు. అందులో జీవించకు. నువ్వుకానిదానితో సహవాసం చేస్తూఉంటే నీకు బంధం ఏర్పడుతుంది. బంధాన్నిబట్టి దేహం వస్తుంది. నీవుకానిదానిగురించి ఆలోచించకుండా నీవుఏదైతే అవునో దానిగురించి ఆలోచించు. నిరంతరము ధ్యానంచేసి బ్రహ్మానుభవంపొందితే మీరు ఊహించనటువంటి సుఖాన్ని, శాంతిని పొందుతారు.

మీకు ఎప్పుడైతే బ్రహ్మానుభవం కలిగిందో అప్పుడు అజ్ఞానం నశిస్తుంది, మోహం నశిస్తుంది. మీకు ఏకారణంవలన దుఃఖం వచ్చినా లోపల అజ్ఞానము ఉన్నట్లు గుర్తు, లోపల మోహం ఉన్నట్లు గుర్తు. నీలోపల అజ్ఞానము లేకపోతే, మోహం లేకపోతే అసలు దుఃఖం రానేరాదు. బ్రహ్మానుభవం అనేది మీహృదయంలో పొందవచ్చు. ఇప్పుడే ఇక్కడే ఈశరీరం ఉండగానే బ్రహ్మానుభవం పొందవచ్చు. అది మీకు అనుభవంలోనికి వచ్చాక అజ్ఞానముతోఉన్న సంబంధం తెగిపోతుంది. అప్పుడు మీకు సుఖం తెలుస్తుంది, శాంతి తెలుస్తుంది. విషయాన్ని చింతించగా, చింతించగా ఆవిషయంమీద కోరిక కలుగుతుంది. ఆకోరికను నెరవేర్చుకోవటానికి ప్రయత్నంచేస్తారు. కోరిక నెరవేరితే గర్వం వస్తుంది, నెరవేరకపోతే దుఃఖం వస్తుంది. మాకు గర్వంలేదు అనుకొంటారు అంతర్‌దృష్టి ఉన్నవారికి మాత్రమే లోపల ఎంత అవినయంఉందో, ఎంత గర్వంఉందో తెలుస్తుంది. అంతర్‌దృష్టి లేనివారికి ఏమి పోగొట్టుకోవాలో వారికే తెలియదు. నీమొఖం అద్దంలో చూసుకొంటున్నావు. ప్రతిబింబం కనబడుతుంది. అద్దంలో కనబడే ప్రతిబింబం ఎంతనిజమో ప్రపంచంలో కనబడే వస్తుజాలముకూడా అంతే నిజం. బింబం ఆత్మ, ప్రతిబింబం మాయ. నీవు ఒక్కడివే నిజం. మనస్సు కల్పించే వస్తుజాలంఅంతా ప్రతిబింబంలాంటిదే. ఆప్రతిబింబం ఎంతనిజమో, ఆప్రతిబింబాన్ని పట్టుకోవటానికి మనం ప్రయత్నంచేయటం ఎలాఉంటుందో ప్రపంచంలోని వస్తువులద్వారా సుఖాన్ని, మోక్షాన్ని పొందుదామని అనుకోవటంకూడా అటువంటిదే.

ఆత్మను తెలుసుకోమని కృష్ణుడు చెపుతాడు. ఆత్మఅంటే ఎవరు మనమే. అంటే మనలను మనమే తెలుసుకోవాలి. నిన్ను నీవు తెలుసుకోవటానికి పెద్ద తెలివితేటలు అవసరంలేదు అన్నారు భగవాన్. దేవుడు ఉన్నాడోలేడో నీకు తెలియదుగాని నీకు ఒకనేను తెలుస్తోందికదా. ఆనేనును నేను సహాయంతోటి తీసివెయ్యి. అదేసాధన. విషయచింతన వలన కోరిక వస్తుంది. కోరికవలన కోపంవస్తుంది. కోపంలోనుండి మోహం పుడుతుంది. మోహంవలన విచక్షణ తగ్గిపోతుంది. విచక్షణ అంటే ఆత్మ, అనాత్మ వివేకం. అంటే ఏది సత్యం, ఏది సత్యంకాదు అని గ్రహించేశక్తి పోతుంది. దేనిలోనుండి విడుదలపొందాలి అనే వివేకం పోతుంది. మోహంలో పడినపుడు బుద్ధి నశించటం ప్రారంభమవుతుంది. బుద్ధి నశించటం ప్రారంభించిన తరువాత మనిషి పూర్తిగా నశిస్తాడు. మన శరీరానికి డ్రైవర్‌బుద్ధి. డ్రైవర్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి. డ్రైవర్ సరిగాలేకపోతే మనం పతనమవుతాము, చీకటిలోకాలకు పోతాము. నీకు సొంతబుద్ధి ఉండాలి. నీస్వంతబుద్ధిని జీవితంపొడుగునా కాపాడుకో. నీకు ఎంత ఐశ్వర్యంఉన్నా స్వంతబుద్ధి లేకపోతే బానిసలతో సమానం. బాహ్యంగా విజృంభించే మనస్సును ఆవిషయములనుండి వెనక్కిలాగి ఆత్మను చింతించేలాగ చెయ్యి. నిన్నునీవు ఉద్ధరించుకోవటానికి

నీతెలివిని, వివేకాన్ని ఉపయోగించుకో. నీలోపలున్న బ్రహ్మంగురించి తెలియకుండా నీకుమోక్షం రాదు, శాంతి కలుగదు. నీకు మోక్షం కావాలంటే బ్రహ్మజ్ఞానమును సంపాదించు. మనం ఏవస్తువునైతే పొందాలిఅనుకొంటున్నామో దానివిలువ మనకు తెలియాలి. దానివిలువ మనకు తెలియకపోతే దానిని పొందాలనే బుద్ధికూడా మనకు కలుగదు. (సత్పురుషుల సహవాసంలోఉన్న రుచే నీకు తెలియనపుడు మోక్షంలో ఉన్నరుచి నీకు ఎలాతెలుస్తుంది అంటున్నారు ఆచార్యులవారు.)

మీకు ఏదైనా దుఃఖంవస్తే దేవుని అనుగ్రహం లేదుఅనుకొంటారు. అది wrong thinking. దేవుని అనుగ్రహం ఎప్పుడూ ఉంది. ఒకోసారి మనకి చాలా ఇష్టమైనవారిచేత దేవుడు తిట్టిస్తాడు. వారిమీద ఉన్న మమకారం పోవటంకోసం అలాచేస్తున్నాడు. లేకపోతే చనిపోయేవరకూ వారివెనకాల తిరుగుతారు. వీళ్ళు నన్ను తలపెట్టుకోవటంలేదు, మాయలోపడిపోతున్నారు ఆందులోనుండి విడుదల చేయాలిఅని దేవుడు వారిచేత మిమ్మల్ని తిట్టిస్తాడు. అప్పుడుగాని మీకు వారిమీద మమకారంపోదు. మమకారం వదిలినతరువాత బుద్ధి దేవుడిమీద స్థిరంగా ఉంటుంది. మీకు ఎవరిమీద అయితే మమకారం ఉందో వారు తిట్టినాగాని అదికూడా దేవునిఅనుగ్రహమే. దేవుని అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది లేదని అనుకొంటాము. అది గుర్తించే వివేకము, తెలివి లేక అలా అనుకొంటాము.

జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ కాలాన్ని వృధాచేసుకోవద్దు. భవిష్యత్‌లో మీరు మోక్షమును పొందటానికి మంచిరోడ్డు వేసుకోండి. విషయచింతనతో కాలమును పాడుచేసుకోవద్దు. మరణం దగ్గరకువస్తోంది. ఇల్లు అంటుకొంది అనుకోండి వెంటనే అందులోనుండి బయటకు వస్తారా లేక మేము పెద్దవాళ్ళము ఎవరైనావచ్చి ఆహ్వానిస్తేనే బయటకు వస్తాముఅని అంటారా? వెంటనే బయటకు వస్తారు. కారణం ఏమిటి? వాడిప్రాణాన్ని రక్షించుకోవటంకోసం ఎవరికోసం చూడకుండా వాడిఅంతటవాడే బయటకు వచ్చేస్తాడు. ఈప్రపంచంఅనే అగ్నిగుండంలోనుండి బయటకు రావాలంటే అంటుకొన్న ఇంట్లోనుండి వాడిప్రాణాన్ని రక్షించుకోవటానికి వాడు ఎంతవేగముగా బయటకు వస్తున్నాడో అంతవేగంగా మీరుసాధనచేసుకొంటే ఈజన్మలోనే మీరు తరిస్తారు. ఈజన్మలోనే మీకు మోక్షం వస్తుంది. అలాకాదు మేము కామక్రోధములనుండి విడుదలపొందలేము అంటారా మీరు కర్మచేస్తారు, కర్మనుబట్టి దేహం వస్తుంది. దేహాన్నిబట్టి దుఃఖం వస్తుంది. అక్కడనుండి సంసారం ప్రారంభమవుతుంది.

(పూర్వంఅన్నీ మట్టిరోడ్డులు, ఎద్దులబండ్లు. ఇప్పుడు కార్లు, రైళ్ళు, విమానాలు వచ్చాయి. అంతమాత్రంచేత మనిషికి దుఃఖం తగ్గిందా? సుఖంగా, శాంతిగా ఉన్నారా? కార్లలో సుఖంఉంటే, విమానంలో సుఖంఉంటే మీరు అంతా సుఖపడిపోవాలికదా. ఎవరిమొఖంలో అయినా సుఖంఉందా, శాంతి ఉందా దీనికి సమాధానం చెప్పండి అంటున్నారు స్వాములవారు. సుఖం బయటలేదు బ్రహ్మంలో ఉంది. సుఖం ఎక్కడ ఉందో దానిని తెలుసుకొంటే మీరు సుఖాన్ని పొందుతారు. సుఖం బ్రహ్మంలోఉంది. ఆబ్రహ్మము ఎవరు నీవై ఉన్నావు. అంటే నీలోపలే సుఖం ఉంది. నీస్వరూపానికి వేరుగా సుఖంలేదు.) భగవంతునినామం చాలా పవిత్రమైనది. భగవంతుని నామం ఎంత పవిత్రమైనదో ఆనామాన్ని స్మరిస్తే మీహృదయాలుకూడా అంత పవిత్రం అవుతాయి. ఎప్పుడయితే మీహృదయాలు అంత పవిత్రం అయినాయో మీహృదయంలో ఉన్న బ్రహ్మము మీకు ఎరుకపడుతుంది, అప్పుడు మీరు సుఖి అవుతారు.

* * *